క్లుప్తంగా

వైవీ సుబ్బారెడ్డికి ఆసిఫ్ అభినందనలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): రాజ్యసభ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయిన వైఎస్సార్ సీపీ నేత వైవీ సుబ్బారెడ్డికి ఏపీ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ షేక్ ఆసిఫ్ అభినందనలు తెలిపారు. వైవీ సుబ్బారెడ్డిని బుధవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన ఆసిఫ్ పుష్పగుచ్ఛమిచ్చి శుభాకాంక్షలు తెలియచేశారు. రాజ్యసభ సభ్యత్వానికి సుబ్బారెడ్డిని నామినేట్ చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మైనార్టీల పక్షపాతని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని అఖండ మెజారిటీతో గెలించాలని కోరారు. అలాగే పశ్చిమ నియోజకవర్గం నుంచి ఆసిఫ్‌ను మంచి మెజారిటీతో గెలిపించాలని వైవీ సుబ్బారెడ్డి నియోజకవర్గ పార్టీ నాయకులను కోరారు. వైవీ సుబ్బారెడ్డిని కలిసి అభినందించినవారిలో పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు బత్తుల కొండారెడ్డి, మెట్టు వెంకటరెడ్డి, కేసరి రాజశేఖరరెడ్డి, చెన్నుబోయిన శ్రీనివాస్ ఉన్నారు.

పూజా మండపాల నిర్మాణంపై సమీక్ష



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న పూజా మండపాలపై చైర్మన్ కర్నాటి రాంబాబు ఆలయ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. నటరాజ స్వామి వారి ఆలయం సమీపంలోని ఖాళీ స్థలంలో దేవస్థానం పూజా మండపాల నిర్మాణానికి కార్యాచరణ రూపొందించింది. నిర్మాణాలకు సంబంధించి ప్లాన్ సిద్ధం కావడంతో ఆలయ ఈఈ కోటేశ్వరరావుతో చైర్మన్ స్థల పరిశీలన చేశారు. అదే విధంగా మల్లేశ్వరాలయం వద్ద క్యూలైన్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఈఈ కోటేశ్వరరావును కోరారు. స్వామి వారి దర్శనానికి ప్రతి నిత్యం భక్తులకు విశేషంగా విచ్చేస్తున్న నేపథ్యంలో క్యూలైన్లు లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సాధ్యమైనంత త్వరగా స్వామి వారి ఆలయ ప్రాంగణంలో క్యూలైన్లు ఏర్పాటు చేయాలని కోరారు.

తల్లి మృతిపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తల్లి మృతిపై కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. భీమనవారిపేట సయ్యద్ అప్పలస్వామి కళాశాల వెనుక కొండ ప్రాంతంలో కైలా రాజు తన కుమారుడు, తల్లి భారతీతో సొంత ఇంట్లో వేర్వేరు పోర్షన్లలో నివాసం ఉంటారు. రాజు సెక్యూరిటీ గార్డుగా పని చేస్తుంటాడు. మంగళవారం రాత్రి డ్యూటీ ముగించుకుని ఇంటికి వచ్చిన రాజుకు తల్లి ఇంట్లో మంచంపై పడి ఉండటంతో తమ్ముడు, చెల్లెల సాయంతో ఆసుపత్రికి తరలించారు. భారతీ మృతి చెందిందని డాక్టర్లు పేర్కొనడంపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

24న ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్లు కొలువై ఉన్న ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ 24వ తేదీన జరగనుంది. పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం తెల్లవారుజామున 5–55 గంటలకు దుర్గగుడి ఘాట్‌రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం నుంచి గిరి ప్రదక్షిణ ప్రారంభం కానుంది. ఆది దంపతులైన శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్లు ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై కొలువై తీరగా, భక్తులు, దీక్షాదారులు, ఆలయ అధికారులు, సిబ్బంది, సేవా సిబ్బంది పాల్గొంటారు. అమ్మవారి ఘాట్‌రోడ్డు నుంచి ప్రారంభమయ్యే గిరి ప్రదక్షిణ కుమ్మరి పాలెం, విద్యాధరపురం, సితారా జంక్షన్, కబేళా, పాలప్రాజెక్టు, చిట్టినగర్, కేటీ రోడ్డు, శ్రీనివాసమహల్, బ్రహ్మణ వీధి, రథం సెంటర్ మీదగా తిరిగి ఆలయానికి చేరుకుంటుంది. భక్తులందరూ పాల్గొనాలని కోరారు.

బీటెక్ విద్యార్థిని అదృశ్యంపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బీటెక్ విద్యార్థిని అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. చిట్టిగారి పార్కు ప్రాంతానికి చెందిన ఎం. క్రాంతి, శ్రీనివాస్‌లు భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె షాలిని కంచకచర్ల మిక్ కాలేజీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతుంది. బుధవారం సాయంత్రం ఇంట్లో ఉన్న షాలిని కాలేజీ పని చేసుకుంటుండగా, తల్లి స్నానం చేసేందుకు వెళ్లింది. స్నానం అయిన తర్వాత బయటకు వచ్చి చూసే సరికి ఇంట్లో షాలిని కనిపించలేదు. చుట్టు పక్కల, తెలిసిన వారిని ఆరా తీసినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

వలంటీర్లు.. సంక్షేమ వారథులు

నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి



వలంటీర్లను సత్కరిస్తున్న భాగ్యలక్ష్మి, ఆసిఫ్ తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు చేరువ చేస్తున్న వలంటీర్లు సంక్షేమ వారథులని, వారి సేవలు అమూల్యమైనవని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. పశ్చిమ నియోజకవర్గంలోని 46, 47, 48, 49, 50 డివిజన్ల పరిధిలోని వలంటీర్లకు బుధవారం కెఎల్ రావు నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సేవా పురస్కారాలు అందచేశారు. ఆయా డివిజన్ల పరిధిలో 221 సేవ మిత్రలు, 7 సేవ రత్న, రెండు సేవ వజ్ర పురస్కారాలను ఆమె వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ షేక్ ఆసిఫ్, కార్పొరేటర్లతో కలిసి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వరుసగా నాలుగవ ఏడాది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న సేవ పురస్కారాలు వలంటీర్ల అత్యుత్తమ సేవలకు గుర్తింపుగా భావిస్తున్నామని తెలిపారు. కుల, మత, రాజకీయాలు, వర్గాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందుతున్నాయన్నారు. తమ పరిధిలోని కుటుంబాలకు చేదోడువాదోడుగా ఉంటూ నిస్వార్థంగా సేవలు అందిస్తున్న వలంటీర్లు అభినందనీయులని పేర్కొన్నారు. పురస్కారాల ప్రదాన కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకుని మరింత చక్కగా పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. నవరత్నాల అమలులో భాగస్వామ్యం, ప్రజలకు అన్ని విధాల సహాయ సహకారాలను అందించడం తదితర అంశాల ఆధారంగా ప్రభుత్వం వలంటీర్లను పురస్కారాలకు ఎంపిక చేస్తుందని చెప్పారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దార్శనికతతో ఏర్పాటు చేసిన గ్రామ/వార్డ్ సచివాలయ, వంలటీర్ వ్యవస్థలు సత్ఫలితాలను ఇస్తున్నాయని పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్, ఏపీ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్ పేర్కొన్నారు. నిబద్ధత, నిస్వార్థంగా సేవలు అందిస్తున్న వలంటీర్లను ప్రజలు తమ కుటుంబంలోని సభ్యులుగా చూడటం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బుల్లా విజయ కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు అత్తలూరి పెదబాబు, బంకా విజయ, బంకా చాముండేశ్వరి, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడాలి



మాట్లాడుతున్న డాక్టర్ సుబ్రహ్మణం, శ్రీనివాసులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంధన పొదుపు కార్యకలాపాలను అమలు చేయాల్సిన ఆవశ్యకతలో భాగంగా కేవలం ఇంధనాన్ని ఆదా చేయడమే కాకుండా పర్యావరణాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని హైదరాబాద్‌కు చెందిన సిరి ఎక్సెర్జీ అండ్ కార్బన్ అడ్వైజరీ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ జి.సుబ్రహ్మణ్యం అన్నారు. నగర పాలక సంస్థ నూతన భవనం సమావేశ మందిరంలో బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ గ్రౌండ్ లెవల్ ఇంజినీరింగ్ సిబ్బందికి ఇంధన పొదుపుపై వర్క్‌షాప్ నిర్వహించారు. పంప్ ఆపరేటర్లకు మున్సిపాలిటీల్లో ఎనర్జీ ఎఫిషియన్సీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుబ్రహ్మణ్యం ఇంధన పొదుపు ఆవశ్యకతను వివరించారు. మున్సిపల్ వాటర్ పంపింగ్, స్ట్రీట్ లైటింగ్‌లో ఇంధనాన్ని ఆదా చేయడం గురించి చెప్పారు. ఇంధన శక్తి పొదుపులో భాగంగా విద్యుత్ బిల్లులను తగ్గించడమే కాకుండా స్థిరత్వాన్ని కాపాడుకునేందుకు కార్బన్ ఉద్గారాలను తగ్గించేటప్పుడు బొగ్గు, చమురు, గ్యాస్ వంటి వేగంగా క్షీణిస్తున్న వనరులను కూడా సంరక్షిస్తుందని వెల్లడించారు. వివిధ రంగాల్లో పొదుపు చేయాలంటే వీధి దీపాల్లో 5–10 శాతం, పంపింగ్‌లో 20–25 శాతం, మురుగునీటి పంపింగ్‌లో 15–20 శాతం, మున్సిపల్ భవనాల్లో 5–10 శాతం చేయవచ్చని వివరించారు. సమావేశంలో ఏపీ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ (ఏపీఎస్ఇసీఎమ్) డిఇఇ జీ శ్రీనివాసులు, నగర పాలక సంస్థ చీఫ్ ఇంజినీర్ ప్రభాకరరావు, డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఎలక్ట్రికల్) ఎస్.ఫణీంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఇంధన సామర్థ్యంపై బుక్‌లెట్‌ను విడుదల చేశారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): యువతి అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ప్రకాశం జిల్లా వేటపాలెంకు చెందిన మానిక తిరుపతమ్మ, చిరంజీవి భార్యాభర్తలు. వీరికి ఒక కుమార్తె కుమారి ఉంది. కొంత కాలం కిందట చిరంజీవి చనిపోవడంతో తిరుపతమ్మ మరో వ్యక్తిని వివాహం చేసుకుంది. తిరుపతమ్మ పీ. నైనవరం గ్రామంలోని మామిడి తోటలో కాపలాగా ఉంటున్నారు. మంగళవారం రాత్రి అందరూ భోజనాలు చేసిన తర్వాత నిద్రపోయారు. బుధవారం తెల్లవారుజామున లేచి చూసే సరికి కుమారి కనిపించలేదు. దీంతో ఆందోళన చెంది చుట్టు పక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

వైభవంగా ఎదుర్కోలు ఉత్సవం



హనుమత్ వాహనంపై స్వామివారు



ఎదుర్కోలు ఉత్సవంలో అమ్మవార్లు



ఆలయంలో హోమాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో శ్రీవారికి తులసీదళార్చనను అత్యంత వైభవంగా నిర్వహించారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం మూడో రోజు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం కృష్ణానది నుంచి మంగళవాయిద్యాలతో పవిత్ర జలాన్ని తీసుకొచ్చి నిత్యార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం దశావతార మంత్ర పారమాత్మిక హోమం చేశారు. తులసీదళాలతో సహస్ర అర్చన నిర్వహించారు. ప్రముఖ ఆగమ పండితులు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి పర్యవేక్షణలో పలువురు అర్చకులు ఆధ్వర్యంలో ఆయా వైదిక కార్యక్రమాలను నేత్రపర్వంగా నిర్వహించారు.

శ్రీవారి కంటే అమ్మవారే ఎక్కువ..... కాదు....అమ్మవారి కంటే అయ్యవారే ఎక్కువ...... అంటూ పండితులు వాదించుకుంటూ ఎదుర్కోలు ఉత్సవాన్ని రక్తి కట్టించారు. బుధవారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఎదుర్కోలు ఉత్సవాన్ని నిర్వహించారు. రెండు వర్గాలుగా కూర్చొన్న పండితులు, ఉభయదాతలు శ్రీ వెంకటేశ్వరస్వామి, లక్ష్మీదేవి వార్ల గుణగణాలను కీర్తించారు. ఆగమ పండితులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన హనుమద్వాహనంపై స్వామి వారిని అధిష్ఠింపజేశారు. అనంతరం మంగళవాయిద్యాలు, భజన బృందాలు, అర్చక స్వాములు వెంటరాగా స్వామి వారి వాహనోత్సవం ముందుకు సాగింది. కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ గుడిపాటి పాపారావు పర్యవేక్షించారు.

గడప గడపలో సంక్షేమ పథకాలు

పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్



కరపత్రం అందజేసి ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న పశ్చిమ ఇన్ చార్జి షేక్ ఆసిఫ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న నవరత్నాల పథకాలు ప్రతి గడపలోనూ అందుతున్నాయని పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ అన్నారు. భవానీపురం 41వ డివిజన్‌లో గడప గడపకు మన ఆసిఫ్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ ఎండీ ఇర్ఫాన్‌తో కలిసి డివిజన్‌లోని గడప గడపకు తిరిగారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి పథకాన్ని లబ్ధిదారుల ఇళ్ల వద్దకే చేరుస్తున్నామన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేశామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట మేరకు అవ్వాతాతలకు పింఛను కానుక పెంచుతూ వచ్చారన్నారు. ప్రస్తుతం నెలకు రూ. 3వేల పింఛను అందుతోందన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారుజామున వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి అందిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో అవ్వాతాతలు, విభిన్న ప్రతిభావంతులు పింఛను కోసం ఎన్ని ఇబ్బందులు పడ్డారో ప్రతి ఒక్కరికీ తెలుసునన్నారు. రకరకాల కారణాలు చూపి ఇచ్చే అరకొర పింఛను కూడా ఆలస్యంగా అందజేసేవారని తెలిపారు. ఇక కొత్తగా పింఛను కావాలంటే అప్పట్లో జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. ప్రజలు మళ్లీ వైఎస్ జగనే సీఎం కావాలని కోరుకుంటున్నారు. ఏ ఇంటికి వెళ్లినా ఈ ప్రభుత్వంలో తమకు ఏ పథకంలో లబ్ధి చేకూరిందో ప్రజలే వివరిస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో మరింత సంక్షేమం కావాలంటే మళ్లీ వైఎస్ జగనే సీఎం కావాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు బండి పుణ్యశీల, కార్పొరేటర్లు పడిగిపాటి చైతన్య రెడ్డి, పాత శివాలయం చైర్మన్ బొమ్మ మధు శ్రీకాళహస్తి ట్రస్ట్ బోర్డు మెంబర్ కేసరి చిన్నోడు, హయాత్ మధిర ప్రభాకర్, ఏనుగుల సునీల్ , మండల శ్రీనివాసరావు , షేక్. అబ్దుల్ , వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు



పెయింటింగ్ పోటీల్లో విద్యార్థులు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైలు ప్రయాణికులకు అత్యాధునిక సౌకర్యాలతో మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో భారతీయ రైల్వే 'అమృత్ భారత్ స్టేషన్' పథకం అందుబాటులోకి తీసుకొచ్చింది. అందులో భాగంగా ఈ నెల 26న విజయవాడ డివిజన్‌లోని గుణదల రైల్వే స్టేషన్‌ను దేశ ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ పద్ధతిలో శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని విజయవాడ డివిజన్ పర్సనల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల వ్యాప్తంగా పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు '2047 విక్షిత్ భారత్ విక్షిత్ రైల్వేస్' థీమ్‌తో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. నగరంలోని ఐకాన్ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన పెయింటింగ్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉత్తమ పెయింటింగ్ వేసిన ముగ్గురు విద్యార్థులను రైల్వే అధికారులు విజేతలుగా ప్రకటించారు. వారిలో మొదటి స్థానంలో ఎ.శ్రీహాస్, రెండవ స్థానంలో ఎం.ప్రవీణ్, మూడవ స్థానంలో జె.ప్రభుకుమార్ నిలిచారు. ఈ నెల 26న గుణదల రైల్వే స్టేషన్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొనే విశిష్ట అతిథుల చేతుల మీదుగా వారికి బహుమతులు, సర్టిఫికెట్‌లను ప్రదానం చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం పరిధిలోని 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో లైన్ల మరమ్మతులలో భాగంగా కొన్ని ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు వెంకటేశ్వర ఫౌండ్రీ రోడ్, హైవే రోడ్‌లోని వెంకటేశ్వర ఫౌండ్రీ నుంచి స్వాతి థియేటర్ రోడ్, గాంధీ బొమ్మ రోడ్ వరకు, ఆశ్రమం రోడ్, బేతపూడి అరుణ కుమారి వీధి, బాజీబాబా మందిరం రోడ్, సభాపతి రోడ్, ఔట్ ఏజన్సీ ఏరియా, మీరా సాహెబ్ వీధి, ఓల్డ్ ఎంఐజీ, వెలంపల్లి కాలనీ, హెచ్‌ఐజీలు, ఐరన్ యార్డ్, గుడివాడ రామారావు వీధి తదితర ప్రాంతాల్లో కరెంట్ ఉండదన్నారు.

- మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ వైర్ల మరమ్మతుల దృష్ట్యా దుర్గాపురం విద్యుత్ సబ్ స్టేషన్ ప్రభుత్వ సంగీత కళాశాల ఫీడర్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీవీ సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాంబమూర్తి రోడ్డు, దుర్గా పురం, బావాజీ పేట, రామ కోటి మైదానం, నూరి హాస్పిటల్ ఏరియా, శారదకాలేజీ ఏరియా తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

ఏపీ స్టేట్ కరాటే రిఫరీ కమిషన్ సభ్యుడిగా హర్ష



రజనీష్ చౌదరి నుంచి నియామక పత్రాన్ని అందుకుంటున్న హర్ష

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ (ఏపీ ఎస్‌కెఎ) సభ్యుడైన పీకెఎస్ హర్ష ఏపీ స్టేట్ కరాటే రిఫరీ కమిషన్ సభ్యుడిగా నియమితులయ్యారు. గొల్లపూడిలో ఇటీవల నిర్వహించిన అసోసియేషన్ వార్షికోత్సవంలో భాగంగా సెమినార్, రిఫరీ జ్యూరీ పరీక్ష జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియ (కాయ్) జనరల్ సెక్రటరీ షిహాన్ రజనీష్ చౌదరి చేతుల మీదుగా హర్ష నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా రజనీష్ చౌదరి మాట్లాడుతూ కరాటే విద్యలో సుశిక్షితులైన హర్షను రిఫరీ కమిషన్ సభ్యుడిగా నియమించిన ఏపీ ఎస్‌కెఎ జనరల్ సెక్రటరీ జె.శ్రీనివాసులు అభినందనీయులన్నారు. ఏ పోటీల్లో అయినా రిఫరీలు కచ్చితత్వాన్ని పాటించాలని తెలిపారు. తనను రిఫరీ కమిషన్ సభ్యుడిగా నియమించిన శ్రీనివాసులుకు ధన్యవాదాలు తెలిపారు. ఆయన నేతృత్వంలో శిక్షణ పొందిన తాను నిజాయతీగా వ్యవహరిస్తానని పేర్కొన్నారు.

వేదాలు భారతీయ సంస్కృతికి ప్రతిబింబాలు

- రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు మల్లాది విష్ణు
- వేద విద్యార్థులకు స్కాలర్ షిప్స్ పంపిణీ



వేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): వేదాలు భారతీయ సంస్కృతికి ప్రతిబింబాలని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. గాంధీనగర్ శారదా కాలేజీలో బుధవారం తుమ్మలపల్లి అన్నపూర్ణమ్మ బ్రాహ్మణ విద్యార్థి గృహం ఆధ్వర్యంలో 100 మంది వేద విద్యార్థులకు స్కాలర్‌షిప్ పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే విష్ణు పాల్గొని మాట్లాడారు. భారతదేశంలో వేల సంవత్సరాల నుంచే వేద విజ్ఞానం ఉందన్నారు. వేదం భగవంతుని స్వరూపమని విశ్వమానవ శ్రేయస్సు కోసమే భగవంతుడు వేదాలను సృష్టించాడని తెలిపారు. ఆధునిక పరిశోధకుల ఊహలకు సైతం అంతుచిక్కని విద్య, వైజ్ఞానిక, సామాజిక, ఆర్థిక విషయాలెన్నో వేదాల్లో ఉన్నాయన్నారు. కనుకనే వేదాల గొప్పదనాన్ని విదేశీయులు సైతం కీర్తిస్తున్నారన్నారు. అటువంటి అమూల్య గ్రంథాలు మనకు వారసత్వ సంపదగా లభించడం అదృష్టమని చెప్పారు. వాటిని పరిరక్షించి వేద విద్య వ్యాప్తికి రాష్ట్ర ప్రభుత్వం, టీటీడీ విశేష కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. మరోవైపు గత కొద్ది దశాబ్దాలుగా తుమ్మలపల్లి అన్నపూర్ణమ్మ హరినారాయణ ట్రస్ట్ అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. తాము సంపాదించిన కోట్ల రూపాయల ఆస్తులను మానవతా దృక్పథంతో సేవా కార్యక్రమాలకు కేటాయిస్తూ భావితరాలకు ఆదర్శంగా నిలిచారన్నారు. నగరానికే తలమానికమైన తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ నెలాఖరులోగా హరినారాయణ విగ్రహాన్ని ప్రారంభించుకుంటామని వివరించారు. దేవదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శాంతి, శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ కుందా సీతారామ శాస్త్రి, వేద పండితులు గుంటూరు శ్రీరామచంద్రమూర్తి సోమయాజి, ట్రస్ట్ ప్రెసిడెంట్ జంధ్యాల శంకర్, ఉపాధ్యక్షులు జి.ఈశ్వర్ పాల్గొన్నారు.

పాన్ ఇండియా వెడ్డింగ్ షో ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న అనురాధ తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): పెళ్లిళ్లు, శుభకార్యాలు, పండుగల సీజన్ సందర్భంగా బందరు రోడ్‌లోని ఎ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో పాన్ ఇండియా వెడ్డింగ్ వోగ్స్ జ్యూయలరీ అండ్ వెడ్డింగ్ షో ఎగ్జిబిషన్ కమ్ సేల్స్‌ను కృష్ణా జిల్లా మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ, బొండా సుజాత, యార్లగడ్డ జ్ఞానేశ్వరి, రాధిక, మాధవి బుధవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్‌లో 75 ప్లస్ లగ్జరీ బ్రాండ్స్ స్టాల్స్ వారు తమ ఉత్పత్తులను ప్రదర్శించారు. అలాగే ప్రముఖ బ్రాండెడ్ జ్యూయలరీ షోరూమ్స్, క్లాత్ వేర్ షోరూమ్స్ నిర్వాహకులు గోల్డ్, డైమండ్, శారీస్, డ్రెసెస్ ఇతర ఉత్పత్తులను అమ్మకం కోసం ఇక్కడ ఏర్పాటు చేశారు. అదే విధంగా డిజైనర్ వేర్, క్లాతింగ్ మెటీరియల్, చీరెలు, ఫ్యాషన్ యాక్సస‌రీస్, జ్యూయలరీ ఐటెమ్స్‌తోపాటు ఒక గ్రాము జ్యూయలరీ కూడా అందుబాటులో లభిస్తున్నాయని నిర్వాహకులు సజ్జా అన్నపూర్ణ, నిరంజన్ తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించేలా బోధన

డీఎస్ఈవో యు.వి.సుబ్బారావు

కృష్ణలంక(విజయవాడతూర్పు): విద్యార్థులు పరీక్షలలో మంచి మార్కులతో మెరుగైన ఫలితాలు సాధించే విధంగా తీర్చిదిద్దాలని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి (డీఎస్ఈవో) యు.వి.సుబ్బారావు ఉపాధ్యాయులకు సూచించారు. కృష్ణలంకలోని ఏపీఎస్ఆర్ఎంసీ హైస్కూల్‌ను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు సన్నద్ధమవుతున్న అంశాన్ని పాఠ్యాంశాలతో పరిశీలించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతమైన మనస్సు ఏకాగ్రతతో చదువుపై దృష్టిపెట్టినప్పుడే మంచి ఫలితాలను సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో అధునాతన మౌలిక వసతులను కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ట్యాబ్‌ల వినియోగాన్ని పరిశీలించారు.

కనులపండువగా గంగానమ్మ గుడి పునఃప్రతిష్ట



పాయకాపురం(విజయవాడరూరల్): విలేజి కుందావారి కండ్రికలో గ్రామ దేవత గంగానమ్మ–పోతురాజు స్వామి వార్ల విగ్రహ గుడి పునఃప్రతిష్ట మహోత్సవం బుధవారం కనులపండువగా నిర్వహించారు. గణపతి పూజ, ఆవాహిత దేవతల అర్చనలు, హోమాలు, అమ్మవారి కి అత్యంత ప్రీతికరమైన మహా శక్తివంతమైన నవ చండీ హోమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త వెలంపల్లి శ్రీనివాసరావు గంగానమ్మదేవతను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గంలోని ప్రజలందరూ సుఖశాంతులతో జీవించేలా ఆశీస్సులు అందించాలని గంగానమ్మ దేవతను కోరారు. ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ గ్రామ దేవతలు శక్తి స్వరూపాలని అన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, కార్పొరేటర్లు యరగొర్ల తిరుపతమ్మ, మోదుగుల తిరుపతమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు, పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మైనర్లు ద్విచక్ర వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తీసుకొంటామని కొత్తపేట సీఐ గణేష్ పేర్కొన్నారు. జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కాలనీ ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఇతర రవాణా వాహనాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. రికార్డులు సరిగా లేని వాహనాలకు జరిమానా విధించడంతో పాటు మైనర్లు నడుపుతున్న పలు బైక్‌లను , మోపెడ్‌లను స్వాధీనం చేసుకుని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

- మధురానగర్: అక్రమంగా అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని బుధవారం గుణదల పోలీసులు అరెస్టు చేసి మద్యం బాటిళ్ళు స్వాధీనం చేసుకున్నారు. కండ్రికకు చెందిన చిట్టిబాబు లచన్ బార్‌లో వెయిటర్‌గా పనిచేస్తున్నాడు. వెయిటర్‌గా వస్తున్న ఆదాయం సరిపోక చిట్టిబాబు బార్‌లో 24 క్వార్టర్ బాటిళ్లను కొనుగోలు చేసి బార్ మూసివేసిన తరువాత అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దీంతో అరెస్టు చేశారు.